హైదరాబాద్‌లో జాతీయ కరాటే టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం వేదికగా గురువారం నుంచి కేఐవో ఆలిండియా కరాటే చాంపియన్‌షిప్ మొదలుకానుంది. సాట్స్, కరాటే ఇండియా ఆర్గనైజేషన్(కేఐవో)కు అనుబంధంగా ఉన్న తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్(టీఎస్‌కేడీఏ) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు టోర్నీ జరుగనుంది. ఇందులో 1500 మందికి పైగా కరాటే ప్లేయర్లు అండర్-21, సీనియర్, పారా విభాగాల్లో పోటీపడనున్నారు.

సీఫర్ట్ మెరుపులు

వెల్లింగ్టన్:పాకిస్థాన్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను న్యూజిలాండ్ 4-1తో చేజిక్కించుకుంది. బుధవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో కివీస్ 8 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత పాక్.. నిర్ణీత ఓవర్లలో 128/9స్కోరుకు కుప్పకూలింది. సారథి సల్మాన్ (51) మరోసారి ఆ జట్టును ఆదుకున్నాడు. నీషమ్ (5/22) ఐదు వికెట్లతో చెలరేగాడు. ఛేదనను కివీస్ 10 ఓవర్లలోనే దంచేసింది. టిమ్ సీఫర్ట్ (38 బంతుల్లో 97 నాటౌట్,6ఫోర్లు,10సిక్సర్లు)ఇన్నింగ్స్‌తో కివీస్ అలవోకగా గెలిచింది.

పృథ్వీశ్వర్ సెంచరీ

టీడీసీఏ అండర్-17 వన్డే ట్రోఫీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ జిల్లాల క్రికెట్ అసోసియేషన్(టీడీసీఏ) వన్డే టోర్నీలో పాంథర్స్ ప్లేయర్ పృథ్వీశ్వర్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టాడు. తొలుత పృథ్వీశ్వర్(104) సెంచరీకి తోడు అభినవ్(65), మణీశ్వర్(58) రాణించడంతో పాంథర్స్ టీమ్ 45.1 ఓవర్లలో 296కు ఆలౌటైంది. ఛేదనలో రైజర్స్ 36.5 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌటైంది.

డికాక్ కేక

అజేయ అర్ధసెంచరీతో విజృంభణ • కోల్‌కతా నైట్‌రైడర్స్ బోణీ • రాజస్థాన్‌కు రెండో పరాభవం

గువాహటి: ఐపీఎల్-18 సీజన్‌ను ఓటమితో ఆరంభించిన డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్(కేకేఆర్) రెండో మ్యాచ్‌లో బోణీ కొట్టింది. బుధవారం గువాహటిలోని బర్సపర స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. రాజస్థాన్ నిర్దేశించిన 152 పరుగుల ఛేదనను కోల్‌కతా.. 17.3 ఓవర్లలోనే పూర్తి చేసింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ (61 బంతుల్లో 97 నాటౌట్, 8ఫోర్లు, 6సిక్స్‌లు) మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్.. కోల్‌కతా బౌలర్లు వరుణ్ చక్రవర్తి (2/17), మొయిన్ అలీ (2/23), వైభవ్ అరోరా (2/33) కట్టడి చేయడంతో తక్కువ స్కోరుకే పరిమితమైంది. ధ్రువ్ జురెల్ (28 బంతుల్లో 33, 5 ఫోర్లు) టాప్ స్కోరర్. డికాక్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

డికాక్ షో

స్వల్ప లక్ష్య ఛేదనను కోల్‌కతా కూడా నెమ్మదిగానే ఆరంభించింది. పవర్ ప్లేలో ఆ జట్టు చేసింది 40 పరుగులే. 12 బంతులాడి 5 పరుగులే చేసిన ఓపెనర్ మొయిన్ అలీ రనౌట్ అయ్యాడు. మూడో స్థానంలో వచ్చిన సారథి రహానే (18) కూడా నిరాశపరిచాడు. కానీ ఆరంభంలో ఆచితూచి ఆడిన డికాక్.. క్రీజులో కుదురుకున్నాక బ్యాట్‌కు పనిచెప్పాడు. హసరంగ 11వ ఓవర్లో డీప్ మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్సర్ బాదడంతో ఈ సీజన్‌లో అతడి తొలి అర్ధ సెంచరీ పూర్తయింది. రహానే నిష్క్రమించినా రఘువంశీ (22 నాటౌట్) సాయంతో డికాక్ మ్యాచ్‌ను ముగించాడు. డికాక్‌ను నిలువరించేందుకు రాజస్థాన్ తాత్కాలిక కెప్టెన్ పరాగ్ ఎన్ని రకాలుగా ప్రయత్నం చేసినా లాభం లేకుండా పోయింది. బాదుడే లక్ష్యంగా పెట్టుకున్న డికాక్ సమయోచిత ఇన్నింగ్స్‌తో ఈసీజన్‌లో జట్టుకు తొలి విజయాన్ని అందించాడు.

నిలకడ లేమితో..

67/1. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 7.4 ఓవర్లకు చేసిన స్కోరిది. కానీ నాలుగు ఓవర్ల వ్యవధిలో నాలుగు కీలక వికెట్లు కోల్పోయిన ఆ జట్టు 11 ఓవర్లకు 82/5గా మారి పీకల్లోతు కష్టాల్లో చిక్కుకుంది. గత మ్యాచ్‌లో మెరుపులు మెరిపించిన శాంసన్ (13) కోల్‌కతాతో విఫలమైనా ఓపెనర్ యశస్వీ (24 బంతుల్లో 29, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), కెప్టెన్ రియాన్ పరాగ్ (15 బంతుల్లో 25, 3 సిక్సర్లు) మెరుపులతో ఆ జట్టు ఇన్నింగ్స్ మెరుగ్గానే ఆరంభమైంది. హోంగ్రౌండ్‌లో 15 బంతుల్లోనే మూడు భారీ సిక్సర్లతో జోరు మీద కనిపించిన పరాగ్.. ఆ జోరును కొనసాగించలేకపోయాడు. కోల్‌కతా స్పిన్నర్లు వరుణ్, అలీ దెబ్బకు రాయల్స్ వరుస ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయింది. 8, 10వ ఓవర్లలో వరుణ్.. పరాగ్, హసరంగ(4)ను ఔట్ చేయగా 9, 11వ ఓవర్లలో మొయిన్.. జైస్వాల్, నితీశ్ (8)ను పెవిలియన్‌కు చేర్చాడు. శుభమ్ దూబే (9), హెట్‌మెయర్ (7) కూడా విఫలమయ్యారు. జురెల్ మెరుపులతో రాజస్థాన్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది.

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
హైదరాబాద్	1	1	0	2	2.20
బెంగళూరు	1	1	0	2	2.13
పంజాబ్	1	1	0	2	0.55
చెన్నై	1	1	0	2	0.49
ఢిల్లీ	1	1	0	2	0.37
కోల్‌కతా	2	1	1	2	-0.30
లక్నో	1	0	1	0	-0.37
ముంబై	1	0	1	0	-0.49
గుజరాత్	1	0	1	0	-0.55
రాజస్థాన్	2	0	2	0	-1.88

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

సంక్షిప్త స్కోర్లు

రాజస్థాన్: 20 ఓవర్లలో 151/9 (జురెల్ 33, జైస్వాల్ 29, వరుణ్ 2/17, మొయిన్ 2/23); **కోల్‌కతా:** 17.3 ఓవర్లలో 153/2(డికాక్ 97 నాటౌట్, రఘువంశీ 22 నాటౌట్, హసరంగ 1/34)

ఖతర్నాక్ కుర్రాళ్లు!

దేశవాళీల్లో టన్నుల కొద్దీ పరుగులు చేసినా లెక్కకు మిక్కిలి వికెట్లు తీసినా రాని గుర్తింపు.. ఐపీఎల్‌లో ఒక్క మ్యాచ్‌లో మెరిస్తే ఓవర్ నైట్ స్టార్‌డమ్ సొంతం! ఇలా ఐపీఎల్‌లో మెరిసి నేడు అంతర్జాతీయ స్థాయిలో స్టార్లుగా వెలుగొందుతున్న వారెందరో! ఇటీవలే మొదలైన తాజా సీజన్‌లోనూ కొందరు కొత్త కుర్రాళ్లు ఆడిన ఒక్క మ్యాచ్‌తోనే 'ఫ్యూచర్ స్టార్' అయ్యే లక్షణాలు తమలో ఉన్నాయని చెప్పకనే చెప్పారు.

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

'యత్ర ప్రతిభ అవ్‌సర్ ప్రప్నోతిహి' - 18 సీజన్లుగా క్రికెట్ ప్రపంచం నివ్వెరపోయే విధంగా ప్రపంచాన్ని తన వైపునకు తిప్పుకున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మోటో ఇది. మన భాషలో చెప్పుకుంటే 'ప్రతిభ అవకాశాన్ని కలిసే చోటు'. క్రికెట్ మతంగా వెలుగొందుతున్న భారత్‌లో క్రికెట్ వీరులకు.. అందునా ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవేలేదు. కానీ కావాల్సిందల్లా వారి ప్రతిభను ప్రపంచానికి చాటేందుకు సరైన వేదిక. అందుకే కుర్రాళ్లకు ఐపీఎల్ ఒక వరం.

ఆర్య ఆగమనం

గుజరాత్‌తో తాజాగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ ఓపెనర్‌గా వచ్చిన ప్రియాన్ష్ ఆర్య.. ఐపీఎల్‌లో తన ఆగమనాన్ని ఘనంగా చాటాడు. సిరాజ్, రబాడా వంటి అంతర్జాతీయ స్థాయి బౌలర్ల బౌలింగ్‌లో ఏమాత్రం బెరుకు లేకుండా అలవోకగా షాట్లు ఆడి 23 బంతుల్లోనే 47 పరుగులు చేశాడు. ఈ క్రమంలో అతడి స్ట్రైక్‌రేట్ ఏకంగా 204గా నమోదవడం విశేషం. గతేడాది ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లోనే ఈ కుర్రాడి పేరు మార్మోగింది. సౌత్ ఢిల్లీ తరపున బరిలోకి దిగి ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు దంచడంతో పాటు 43 బంతుల్లోనే శతకం సాధించి అందరి దృష్టినీ ఆకర్షించడంతో ఐపీఎల్ ఫ్రాంచైజీల కన్ను అతడిపై పడింది. వేలంలో ఈ ఢిల్లీ కుర్రాడిని పంజాబ్ ఏకంగా రూ. 3.8 కోట్లు వెచ్చించి సొంతం చేసుకుని ఓపెనర్‌గా అవకాశమిచ్చింది.

ఫినిషర్ అశుతోష్

గత సీజన్‌లో పంజాబ్‌కు ఆడిన అశుతోష్ శర్మ అంచనాలకు మించి రాణించాడు. 103 బంతులెదుర్కొని 189 పరుగులు చేసిన అతడు పలు మ్యాచ్‌లలో శశాంక్ సింగ్‌తో కలిసి అదరగొట్టాడు. తాజా సీజన్‌లో ఢిల్లీకి ఆడుతున్న ఈ మధ్య ప్రదేశ్ కుర్రాడు.. ఆడిన తొలి మ్యాచ్‌లోనే 31 బంతుల్లో 5 బౌండరీలు, 5 భారీ సిక్సర్ల సాయంతో ఆఖరిదాకా అజేయంగా నిలిచి 66 పరుగులు చేయడంతో లక్నో నిర్దేశించిన 210 పరుగుల లక్ష్యాన్ని క్యాపిటల్స్ మరో 3 బంతులు మిగిలుండగానే పూర్తిచేసింది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగిన అశుతోష్.. ఒత్తిడిలోనూ నింపాదిగా ఉండి మ్యాచ్ ముగించిన తీరు అమోఘం! అశుతోష్ ఇదే జోరును కొనసాగిస్తే త్వరలోనే భారత జట్టులోకి రావడం పెద్ద కష్టమేమీ కాదు. వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్ సన్నాహకాల్లో ఉన్న టీమ్ ఇండియా సెలెక్టర్లు.. తాజా సీజన్‌లో ఈ కుర్రాడిపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశమూ లేకపోలేదు.

విప్రాజ్ ఆల్‌రౌండ్ షో

లక్నో-ఢిల్లీ మ్యాచ్‌లో క్యాపిటల్స్ విజయంలో అశుతోష్ పాత్ర ఎంత ఉందో అందుకు ఏమాత్రం తీసిపోని కష్టం విప్రాజ్ నిగమ్‌ది. 20 ఏండ్ల ఈ బారాబంకి (ఉత్తరప్రదేశ్) కుర్రాడు.. బంతితో పాటు బ్యాట్‌తోనూ మెరుపులు మెరిపించగల సమర్థుడు. భారీ ఛేదనలో ఢిల్లీ 113/6 గా ఉండగా క్రీజులోకి వచ్చిన విప్రాజ్.. 15 బంతుల్లోనే ఐదు బౌండరీలు, 2 భారీ సిక్సర్లతో 39 రన్స్ చేసి ఢిల్లీని రేసులోకి తెచ్చాడు. బంతితోనూ మార్క్‌రమ్‌ను బోల్తా కొట్టించాడు. అవకాశం వస్తే బాల్, బ్యాట్‌తో విప్రాజ్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడని, అండర్-14, అండర్-19 దశ నుంచి అతడికి వెన్నతో పెట్టిన విద్య అని విప్రాజ్ కోచ్ సర్వర్ నవాబ్ తెలిపాడు.

వీరికి తోడు ముంబై తరపున ఆడిన మలప్పురం స్పిన్ మాంత్రికుడు విఘ్నేశ్ పుతుర్.. రాజస్థాన్ బ్యాటర్ శుభమ్ దూబే.. లక్నో స్పిన్నర్ దిగ్వేశ్ రతి, సన్‌రైజర్స్ పేసర్ సిమర్‌జీత్ సింగ్ వంటి కుర్రాళ్లు తొలి మ్యాచ్‌లోనే సత్తా చాటారు. రెండు నెలల పాటు జరుగబోయే ఈ మెగాటోర్నీలో మరింత మంది కుర్రాళ్లు వెలుగులోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

సెమీస్‌లో లావిస్టా క్రూసేడర్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అరో టీ-9 గోల్ఫ్ టోర్నీలో లావిస్టా క్రూసేడర్స్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం హోరాహోరీగా సాగిన క్వార్టర్స్ ప్లేఆఫ్‌లో క్రూసేడర్స్..కైన్ డైరీపై అద్భుత విజయం సాధించింది. సింగిల్స్‌లో లావిస్టా గోల్ఫర్ రామ్ ముసునూరి..చక్రవర్తి(కైన్ డైరీ)పై గెలువగా, అమర్‌నాథ్(కైన్ డైరీ) చేతిలో శ్రీనివాసన్(లావిస్టా) ఓడిపోయాడు. డబుల్స్‌లోనూ ఇరు జట్ల మధ్య పోరు డ్రా కాగా, ఫలితం కోసం జరిగిన ప్లేఆఫ్‌లో క్రూసేడర్స్ గెలిచింది. మిగతా క్వార్టర్స్‌లో సెమెట్రిక్స్ 2.5-1.5తో ఫాల్కన్స్‌పై, శ్రీనిధిపై బంకర్ బస్టర్స్, టూటో రూట్ 2.5-.1.5పై సమ్మర్‌స్ట్రోమ్‌పై గెలిచి సెమీస్‌లోకి ప్రవేశించాయి.

అక్టోబర్‌లో భారత్‌కు మెస్సీ

కేరళలో ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడనున్న సాకర్ దిగ్గజం

తిరువనంతపురం: భారత ఫుట్‌బాల్ ప్రేమికులకు శుభవార్త. అంతర్జాతీయ ఫుట్‌బాల్ స్టార్, అర్జెంటీనా సారథి లియోనల్ మెస్సీ ఈ ఏడాది భారత్‌కు రానున్నాడు. కేరళలో రెండు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లు ఆడేందుకు గాను మెస్సీ.. అర్జెంటీనా జట్టుతో కలిసి అక్టోబర్‌లో భారత్‌కు విచ్చేయనున్నాడు. బుధవారం హెచ్ ఎస్‌బీసీ ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించింది. భారత్‌లో ఫుట్‌బాల్ అభివృద్ధికి గాను అర్జెంటీనాతో ఒక ఏడాది ఒప్పందం కుదుర్చుకున్న హెచ్ఎస్‌బీసీ.. కేరళకు రానున్న అర్జెంటీనా టీమ్‌కు స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. గతేడాది నవంబర్‌లో కేరళ క్రీడా శాఖ మంత్రి అబ్దుర్ రెహ్మాన్ ప్రత్యేకంగా అర్జెంటీనాకు వెళ్లి ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడేందుకు ఆ దేశాన్ని ఒప్పించిన విషయం విదితమే.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.